## Summary:

**Indices have increased but investor wealth has not increased**

Around 10 companies have been responsible for the growth in the index. Mid-cap and small-cap haven't grown.
Few positives and negatives in the current market conditions.
ELSS fund to be launched. few details about the existing schemes.

## Original Article:

# సూచీలు పెరిగినా.. మదుపరుల సంపద పెరగలేదు

**'భారతీయ స్టాక్ మార్కెట్లో దీర్ఘకాలానికి అనేక సానుకూలతలు ఉన్నాయి. స్వల్పకాలంలో వినియోగ రంగంలో గిరాకీ లేకపోవడం, వాహనాల విక్రయాలు తగ్గడం, ఎన్‌బీఎఫ్‌సీల సంక్షోభం ఇబ్బందులు పెడుతున్నాయని' అంటున్నారు పీపీఎఫ్ఏఎస్ మ్యూచువల్ ఫండ్ ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీల్ పరాగ్ పారిఖ్. మధ్య, చిన్న స్థాయి కంపెనీలు వృద్ధి చెందితేనే పెట్టుబడిదారులకు లాభాలు వస్తాయని ఈనాడు ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.. ఇంకా ఆయన ఏమంటున్నారంటే...**

ఈనాడు - హైదరాబాద్

**? స్టాక్ మార్కెట్ సూచీలు రికార్డు స్థాయికి చేరుకున్నా.. చిన్న, మధ్య స్థాయి మదుపరులకు లాభాలు రాలేదు.. దీన్ని మీరు ఎలా విశ్లేషిస్తారు.**

నిజమే.. ప్రస్తుతం స్టాక్ మార్కెట్ సూచీలు జీవిత కాల గరిష్ఠాలను తాకాయి. సూచీల్లో ఉన్న దాదాపు పది కంపెనీల షేర్లే ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. మిగతావి పెద్దగా ప్రభావం చూపలేదు. ఈ పది కంపెనీలకు సూచీల్లో వెయిటేజీ ఎక్కువగా ఉండటంతో అది పరుగులు పెట్టినట్లు కనిపిస్తోంది. అధిక భాగం ఉన్న మధ్య, చిన్న స్థాయి కంపెనీలు గత రెండేళ్లుగా ప్రతికూల ఫలితాలనే ఇచ్చాయి. అందుకే, వీటిలో పెట్టుబడి పెట్టిన మదుపరులకు లాభాలు కనిపించలేదు. ఈ పరిస్థితి రానున్న రోజుల్లో మారే అవకాశం ఉంది. ఇప్పుడిప్పుడే వీటిలోనూ కాస్త మంచి ఆదాయాలు కనిపిస్తున్నాయి. కాబట్టి, వీటిలో మదుపు చేసిన వారికీ మంచి రాబడి వచ్చే రోజులు వస్తాయనుకోవచ్చు.

**? ప్రస్తుతం ఎక్కువగా లార్జ్ క్యాప్ షేర్లే ఆసక్తిగా కనిపిస్తున్నాయి కదా! ఎందుకు.**

దీనికి మూడు కారణాలను పేర్కొనవచ్చు. గత ఏడాది మ్యూచువల్ ఫండ్లలో పునర్విభజన జరిగింది. దీంతో చాలా ఫండ్లు లార్జ్ క్యాప్‌లలో మదుపు చేయడం ప్రారంభించాయి. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో (ఈటీఎఫ్) ఖర్చులు తక్కువగా ఉన్నాయని చెప్పి, చాలామంది వీటిపై ఆసక్తి చూపించారు. ఇవి సాధారణంగా సూచీల్లో ఉండే పెద్ద ఫండ్లనే ఎంపిక చేసుకుంటాయి. వీటితోపాటు పింఛను ఫండ్లు, ఎన్‌పీఎస్ పెట్టుబడుల్లాంటివి కూడా లార్జ్ క్యాప్ షేర్లనే ఎంచుకున్నాయి. దీంతో వీటికి గిరాకీ పెరిగింది. భవిష్యత్తులోనూ ఇది కొంత మేరకు కొనసాగేందుకు వీలుంది.

**? మన మార్కెట్‌కు ఉన్న సానుకూలతలు ఏమిటి? ప్రతికూలతలూ ఉన్నాయా.**

భారతీయ మార్కెట్‌ను ప్రధానంగా ముడి చమురు ధరలు ప్రభావితం చేస్తుంటాయి. ప్రస్తుతం ఈ ధర స్థిరంగా కొనసాగుతోంది. ఇది సానుకూలమే. ఇక కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. గత ఐదేళ్ల కాలంలో తీసుకున్న నిర్ణయాల అమలు, సంస్కరణలను కొనసాగించడం, కీలక ఆర్థిక నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంది. మన స్టాక్ మార్కెట్లు దీర్ఘకాలంలో ఆకర్షణీయంగా ఉండేందుకు ఇవే ప్రధాన కారణాలు.



ఈనాడు ఇంటర్వ్యూ

పీపీఎఫ్ఏఎస్ ఛైర్మన్ నీల్ పరాగ్ పారిఖ్

ఇక స్వల్పకాలిక ప్రతికూలతలు ఉన్నాయి. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్ఎస్) సంక్షోభం మార్కెట్‌ను కలవరపెడుతోంది. రానున్న రెండు నెలల కాలంలో అవి అనేక రుణాలను తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉంది. ఈ సంస్థలు ఇచ్చిన రుణాలు ఈ కాలంలో ఎంత వరకూ వసూలవుతాయి.. వాటి నుంచి చెల్లింపులు ఎలా చేస్తాయనేది పరిశీలించాల్సిన అంశం. వినియోగ రంగంలో ఆశించిన వృద్ధి కనిపించడం లేదు. దీంతో ఎఫ్ఎంసీజీల ఆదాయాలు క్షీణించాయి. వాహన రంగంలోనూ విక్రయాలు సరిగా నమోదు కావడం లేదు. ఇవన్నీ స్వల్పకాలంలో మార్కెట్‌ను ప్రభావితం చేస్తాయి. కాబట్టి, కొంత హెచ్చుతగ్గులకు సిద్ధపడాల్సిందే.

ఆయా రంగాలు, కంపెనీల పనితీరును బేరీజు వేసుకుంటూ.. భవిష్యత్తులో మంచి వృద్ధికి అవకాశం ఉందని నమ్మితేనే నేరుగా ఆయా షేర్లలో మదుపు చేయడం ఇప్పుడు మేలు. చాలా కంపెనీల షేర్లు ఆసక్తికరమైన, ఆకర్షణీయమైన ధరల్లోనే లభిస్తున్నాయి. కాకపోతే ఒకటికి రెండుసార్లు ఆలోచించి, నిర్ణయం తీసుకోవాలి. దీర్ఘకాలిక పెట్టుబడికి ప్రస్తుత మార్కెట్ మంచి అవకాశాన్నే కల్పిస్తోంది.

**? మీ ఫండ్ సంస్థ పనితీరు ఎలా ఉంది? కొత్త పథకాలేమైనా తెస్తున్నారా.**

ప్రస్తుతం మేము ఒకటి పూర్తి ఈక్విటీ ఫండ్, మరోటి డెట్ ఫండ్‌ను అందిస్తున్నాం. ఈ రెండింటి నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) దాదాపు రూ.2,100 కోట్ల వరకూ ఉంది. గత ఏడాదికాలంలో మా ఏయూఎం దాదాపు రెట్టింపు అయ్యింది. ఇక యూనిట్ హోల్డర్లు కూడా గత ఏడాది 25,000 మంది ఉండగా.. ఇప్పుడు వారి సంఖ్య లక్షకు చేరువయ్యింది. ఈక్విటీ ఫండ్‌లో కొంత మేరకు అంతర్జాతీయ పెట్టుబడులు కూడా ఉన్నాయి. సగటున ఏడాదికి 16శాతం వరకూ రాబడినిచ్చింది. ఈక్విటీ మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా ఈక్విటీ ఆధారిత పొదుపు పథకం (ఈఎల్ఎస్ఎస్)ను అందుబాటులోకి తెస్తున్నాం. ఈ పరాగ్ పారిఖ్ ట్యాక్స్ సేవర్ ఫండ్ జులై 4 నుంచి అందుబాటులోకి రానుంది. ఈ ఫండ్ ద్వారా రూ.30 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా విధించుకున్నాం.